బీసీల దమ్మేంటో చూపిస్తాం..

మన ఓట్లు మనకే నినాదంతో ముందుకుపోదాం

బడుగులను అణగదొక్కేందుకు చేస్తున్న కాంగ్రెస్ కుట్రలపై బీసీ సంఘాలు భగ్గుమంటున్నాయి. కుల కుంపటిని రాజేస్తున్న ఆ ఆపార్టీ నేతలపై బీసీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా బీసీలంతా ఏకతాటి పైకి రావాల్సిన ఆవశ్యకతను వారు తెలియజేస్తున్నారు. 'బీసీ అభ్యర్థిని ఎలా గెలిపిస్తారో చూస్తాం' అన్న కాంగ్రెస్ నేతల దురహంకార మాటలను సవాల్‌గా తీసుకుని బీసీల సత్తాను నిరూపించాల్సిన సమయం వచ్చిందంటున్నారు. రాష్ట్రంలోని 17 పార్లమెంటు స్థానాల్లో 6 స్థానాలను బీసీలకు కేటాయించి సామాజిక న్యాయాన్ని పాటించిన కేసీఆర్ గొప్పతనాన్ని బీసీ నేతలు కొనియాడుతున్నారు. చేవెళ్లలో బీసీ అభ్యర్థిని గెలిపించుకుని బీసీల దమ్మేంటో చూపిస్తామని స్పష్టం చేస్తున్నారు. బీసీ వర్గాలను అవమానించేలా మాట్లాడితే నాలిక కోస్తామని హెచ్చరిస్తున్నారు. బడుగులను చులకన భావంతో చూస్తున్న కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ ఎన్నికల్లో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని చెబుతున్నారు. మన ఓటు మన బీసీ అభ్యర్థికి వేసుకుని గెలిపించుకుందామని పిలుపునిస్తున్నారు. జనాభాలో మెజార్టీగా ఉన్న బీసీల గొంతుక పార్లమెంటులో వినబడాలంటే బీసీ వర్గానికి చెందిన వ్యక్తి ఎంపీగా ఉండాల్సిన అవసరం ఉందంటున్నారు. - రంగారెడ్డి, ఏప్రిల్ 15 (నమస్తే తెలంగాణ)

బీసీల ఓట్లు లేకుండా ఎలా గెలుస్తారో చూస్తాం..

చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల్లో బీసీల సత్తా చాటుతాం. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఎంతోకాలంగా కృషి చేస్తున్న కాసాని జ్ఞానేశ్వర్‌కే మా మద్దతు. బీసీలపై అహంకార పూరితంగా మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు బీసీల ఓట్లు లేకుండా ఎలా గెలుస్తారో చూస్తాం. బడుగుబలహీన వర్గాల ప్రజలను చులకనగా చూస్తున్న రాజకీయ పార్టీలు, నేతలకు ఓటుతో తగిన బుద్ధి చెబుతాం.

– డి.గోపాల్, రామయ్యగూడ, వికారాబాద్

బీసీనేతకు పట్టం కడుతాం..

ఎంపీ ఎన్నికల్లో బీసీవాదాన్ని పూర్తి స్థాయిలో వినిపిస్తాం. మాకు కావాల్సింది బీసీ నేతల గెలుపు. చేవెళ్ల స్థానం నుంచి పోటీ చేస్తున్న బీసీ నేత కాసానికి ఓటేసి కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులకు చుక్కలు చూపిస్తాం. బీసీలు రాజకీయంగా ఎదిగినప్పుడే అన్ని రంగాల్లో ప్రగతి చెందేందుకు అవకాశం ఉంటుంది. ఏదైమైనా బీసీ లందరం ఏకమై కాసానిని గెలిపించుకుంటాం.

– రాజశేఖర్‌గౌడ్, వైస్ ఎంపీపీ కులకచర్ల మండలం

రాజకీయ పార్టీలకతీతంగా బీసీ అభ్యర్థికి మద్దతిద్దాం..

కాంగ్రెస్ నాయకులు బీసీలను అవహేళన చేయడం సరి కాదు. బీసీలు కనికరించకపోతే కాంగ్రెస్‌కు అధికారం దక్కేదా..? ఇంత అహంకారం పనికిరాదు. ఇప్పుడిప్పుడే కాంగ్రెస్ నాయకుల అసలు రూపం బయటపడుతున్నది. ఎంపీ ఎన్నికల్లో గుణపాఠం తప్పదు. బీసీల సత్తా చూపాలి. బీసీలందరూ ఏకమై మన బీసీ అభ్యర్థికి భారీ విజయాన్ని అందిద్దాం. – శ్రీనివాస్‌యాదవ్, మూలమాడ, నవాబుపేట

కాసాని విజయం ఖాయం..

ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన కాసానికి బీఆర్ఎస్ పార్టీ చేవెళ్ల ఎంపీ టికెట్ ఇవ్వడం సంతోషంగా ఉన్నది. ఆయనను భారీ మెజార్టీతో గెలిపించుకొని బీసీ వాదాన్ని నిరూపిస్తాం. బీసీలను చిన్న చూపుచూస్తున్న పార్టీలకు కనువిప్పుకలిగేలా ఈ ఎన్నికల్లో కాసానిని గెలిపించుకుంటాం. బీసీల ఐక్యతగా అంటే ఎలా ఉంటుందో అందరికీ అర్థమయ్యేలా చేస్తాం.

– సందని రామకృష్ణ, జిల్లా ముదిరాజ్ సంఘం నాయకుడు, ముజాహిద్‌పూర్, కులకచర్ల

మన ఓట్లు మనకే..

రాష్ట్రంలో 70 శాతం ఉన్న బీసీల సత్తా ఎంటో పార్లమెంట్ ఎన్నికల్లో చూపించాలి. బీసీలను కించపరిచేలా మాట్లాడిన మోహన్‌రెడ్డికి తగిన బుద్ధి చెప్పాలంటే చేవెళ్ల పార్లమెంట్ బరిలో ఉన్న కాసాని జ్ఞానేశ్వర్‌ముదిరాజ్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలి. బీసీల సమస్యలు పరిష్కారం కావాలంటే అది బీసీ ఎంపీలతోనే సాధ్యమవుతుంది.

– కంచర్ల శేఖర్, ఆర్కేపురం డివిజన్ వృత్తిదారుల సంఘం అధ్యక్షుడు

బీసీలంతా ఏకతాటిపైకి రావాలి..

పార్లమెంట్ ఎన్నికల్లో బీసీలంతా ఏకతాటిపైకి రావాలి. చేవెళ్ల ఎంపీ అభ్యర్థిగా బీఆర్ఎస్ తరుపున ముదిరాజ్ బిడ్డ కాసాని జ్ఞానేశ్వర్‌కు అవకాశం కల్పించడం సంతోషకరం. బీసీలకు దమ్ముంటే కాసానిని ఎంపీగా గెలిపించుకోవాలని ఓ నాయకుడు విసిరిన సవాల్‌కు మనమందరం ఏకమై ఓటు ద్వారా సమాధానం చెప్పాలి.

– ననాజీపురం లింగం, ముదిరాజ్ సంఘం షాబాద్ మండల అధ్యక్షుడు

కాసానిని గెలిపిద్దాం.. బీసీల గళం వినిపిద్దాం..

బీసీ గళం వినిపించాల్సిన సమయం వచ్చింది. అగ్రవర్ణ రాజకీయ నాయకుల వక్రబుద్ధికి సమాధానం చెప్పే ఆయుధమైన ఓటు మన చేతిలోనే ఉన్నది. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ బలపరిచిన బీసీల ముద్దుబిడ్డ కాసాని జ్ఞానేశ్వర్‌కు ఓటు వేసి భారీ మెజార్టీని అందిస్తాం. కాసాని గెలుపుతో మన బీసీల గొంతుక లోక్‌సభలో వినిపిస్తుంది.

– సి.తిరుపతి, ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు, యాలాల

బీసీకి టికెట్ ఇవ్వడం హర్షణీయం..

బీసీ నేత కాసాని జ్ఞానేశ్వర్‌ను చేవెళ్ల ఎంపీ అభ్యర్థిగా బీఆర్ఎస్ ప్రకటించడం హర్షణీయం. బీసీలందరం సమష్టిగా కృషి చేసి జ్ఞానేశ్వర్‌ను గెలిపించుకుంటాం. ఆయన ఉమ్మడి రంగారెడ్డి జిల్లా చైర్మన్‌గా ఉన్నప్పుడు బీసీల కోసం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారు. జ్ఞానేశ్వర్ గెలుపు చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గానికి ఎంతో అవసరం.

– విజయ్‌కుమార్, హైదర్‌గూడ

అహంకారులకు చెంపపెట్టు..

బీసీలంతా ఐక్యంగా ఉండి ఎన్నికలో వెనకబడిన వర్గాల అభ్యర్థులకు అండగా నిలువాల్సిన అవసరం ఎంతో ఉన్నది. చేవెళ్ల పార్లమెంటు స్థానాన్ని కేసీఆర్ బీసీ వర్గానికి చెందిన కాసానికి ఇచ్చి ఆ వర్గాలపై తనకున్న అభిమానాన్ని చాటుకున్నారు. కాంగ్రెస్, బీజేపీలు మాత్రం అందుకు భిన్నంగా అగ్రకులాలకు చెందిన వారికి టికెట్లు కేటాయించాయి. అందుకే కాసానిని గెలిపించుకోవాలి.

– అందె నర్సింహ

కాసాని గెలుపునకు కృషి చేయాలి..

పార్లమెంట్ ఎన్నికల్లో బీసీ నేత కాసాని జ్ఞానేశ్వర్ గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉన్నది. గతంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు జడ్పీ చైర్మన్‌గా, ఎమ్మెల్సీగా సేవ చేసిన అనుభవం జ్ఞానేశ్వర్‌కు ఉన్నది. అత్యధికంగా ఉన్న బీసీలంతా పార్టీలకతీతంగా ఏకమై కాసానిని గెలిపించుకుంటాం.

– పి.కుమార్‌యాదవ్, బీసీ నేత, కుమ్మరిగూడ, షాబాద్ మండలం

ఓటుతో బీసీల సత్తా చాటుతాం..

చేవెళ్ల స్థానంలో బీసీ అభ్యర్థికి ఓటేసి బీసీల సత్తా చాటుతాం. కాసాని గతంలో 96 బీసీ కులాలను ఒక్క చోటుకి తెచ్చి ఐక్యవేదిక ఏర్పరిచారు. బీసీలను అవమాన పర్చేలా కాంగ్రెస్ పార్టీ దురహంకార మాటలు బీసీల ఆత్మ గౌరవాన్ని దెబ్బతీసేలా ఉన్నాయి. కాసానికి ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించుకోవాలి.

– శ్రీనివాస్ గౌడ్, తాండూరు మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్

గెలిపించి కేసీఆర్‌కు కానుకగా ఇస్తాం

రానున్న ఎన్నికల్లో కాసాని జ్ఞానేశ్వర్‌ను చేవెళ్ల నుంచి గెలిపించుకొని బీసీల ఐక్యతను చాటుతాం. బీసీలపై కొందరు నాయకుల వ్యాఖ్యలు అహంకారపూరితంగా ఉన్నాయి. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బీసీలకు పెద్దపీట వేసి ఆరు ఎంపీ సీట్లు కేటాయించడం అభినందనీయం. బీసీలను విస్మరిస్తున్న కాంగ్రెస్ పార్టీకి తగినబుద్ధి చెబుతాం.

మారోజు రామాచారి, విశ్వకర్మ సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

ఐక్యతే మరింత మందికి అవకాశమిస్తుంది..

వెనకబడిన వర్గాల ఐక్యతను చాటుకోవటం ద్వారా బీసీ అభ్యర్థిని గెలిపించుకోవాలి. అప్పుడే భవిష్యత్‌లో మరింత మంది బీసీలకు అవకాశాలు వస్తాయి. కేవలం ఓటు బ్యాంకుగా వాడుకునే రాజకీయ పార్టీల మాటలను నమ్మి మోసపోకుండా బీసీలు ఐకమత్యంతో ముందుకెళ్లాలి.

– సత్యనారాయణ, మున్నూరు కాపు సంఘం మాజీ అధ్యక్షుడు

ఏకమై.. అహంకారాన్ని ఎదిరిస్తాం..

బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు బీసీల అభ్యున్నతికి ఎంతగానో కృషి చేసింది. కానీ, కాంగ్రెస్ అధికారం చేపట్టిన కొన్ని రోజులకే ఆ పార్టీ నేతలు అహంకార ధోరణితో విర్రవీగుతున్నారు. బీసీలను తక్కువ చేస్తూ కాంగ్రెస్ నాయకులు మాట్లాడటం సిగ్గుచేటు. చేవెళ్లలో బీసీ అభ్యర్థికి ఓటేసి కాంగ్రెస్, బీజేపీలకు బుద్ధి చెబుతాం.

– శ్రీనివాస్‌గౌడ్, అత్తాపూర్

రైతుల సమస్యలు పట్టని ప్రభుత్వం

మూల్యం చెల్లించక తప్పదు..మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

సబితాఇంద్రారెడ్డికి తమ గోడును వెల్లబోసుకుంటున్న గిరిజన రైతులు

కందుకూరు, ఏప్రిల్ 15 : రాష్ట్ర ప్రభుత్వానికి రైతుల సమస్యలు పట్టడం లేదని మాజీ మంత్రి , ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మూల్యం చెల్లించాల్సి వస్తుందని చెప్పారు. సోమవారం దాసర్లపల్లి తండాలో జరిగిన ఆంజనేయ స్వామి ఆలయ కార్యక్రమంలో పాల్గొని తిరిగి వస్తుండగా మూడావత్ జంగు, గిరిజన రైతులు కారుకు అడ్డువచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి ఇబ్బందులు పడుతున్నామన్నారు. కరెంట్, తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని రుణమాఫీ కాలేదని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి దృష్టికి తీసుకువచ్చారు.

కేసీఆర్ ఉన్నప్పుడు సమస్యలు లేవు..

సీఎంగా కేసీఆర్ ఉన్నప్పుడు తమకు సమస్యలు లేవని జై కేసీఆర్.. తిరిగి కేసీఆర్ రావాలంటూ నినాదాలు చేశారు. మాకు మీరే న్యాయం చేయాలని పట్టుబట్టారు. కొన్నిరోజులు ఓపిక పడుదామని తొందర పడవద్దని రైతులను సబితా ఇంద్రారెడ్డి సముదాయించారు. మాజీ మంత్రి మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే రుణమాఫీ చేస్తానని చెప్పి 100 రోజులు దాటిన చేయలేదని, తాగునీటి సమస్యను పట్టించుకోవడం లేదని విచారం వ్యక్తం చేశారు. ప్రభుత్వం రైతుల సమస్యలను పరిష్కరించనట్లయితే రైతులకు అండగా ఉంటూ పోరాటం చేస్తామన్నారు. రైతులు మోత్య, సీత్యానాయక్, వినోద్‌తో పాటు ఎంపీటీసీ తాండ్ర ఇందిరమ్మదేవేందర్. మార్కెట్ కమిటీ చైర్మన్ సురుసాని సురేందర్‌రెడ్డి. మండల పార్టీ అధ్యక్షుడు మన్నే జయేందర్ ముదిరాజ్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు సురుసాని రాజశేఖర్‌రెడ్డి, సీనియర్ నాయకులు గంగాపురం లక్ష్మీనర్సింహారెడ్డి, అంజయ్యగౌడ్, జంబుల కరుణాకర్‌రెడ్డి, యూత్ నాయకులు బొక్క దీక్షిత్‌రెడ్డి, డైరెక్టర్ పొట్టి ఆనంద్, దేవీలాల్ నాయక్, సామ ప్రకాశ్‌రెడ్డి, రామకృష్ణ, బర్కం వెంకటేశ్, రాణాప్రతాప్, సురుసాని సుదర్శన్ రెడ్డి. దేశం కృష్ణారెడ్డి, నవీన్, గణేశ్, రవీందర్, లక్ష్మణాచారి, రవి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

కరెంటు కోతలు.. నీటి కష్టాలు మొదలు

మన్సూరాబాద్‌లోని ఎంఈ రెడ్డి గార్డెన్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్, ఏప్రిల్ 15 : కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే కరెంటు కోతలు, నీటి కష్టాలు మొదలయ్యాయని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తెలిపారు. మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా సోమవారం మన్సూరాబాద్‌లోని ఎంఈ రెడ్డి గార్డెన్‌లో ఎల్బీనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ మహిళా ముఖ్యనాయకులు, కార్యకర్తల సమావేశం ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, జయచంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ దేవిరెడ్డి కమలాసుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. సమావేశానికి మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి సతీమణి రాగిడి రజినిరెడ్డి హాజరయ్యారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రచారం నిర్వహిస్తూ ప్రతిఒక్క రైతు 2 లక్షల రుణాలు తెచ్చుకోవాలని.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే రుణాలు మాఫీ చేస్తుందని రేవంత్‌రెడ్డి తెలిపారన్నారు. ప్రభుత్వం ఏర్పడి 4 నెలలు గడుస్తున్న నేటికి రుణమాఫీ జరుగలేదన్నారు. ప్రతి ఆడబిడ్డకు రూ. 2, 500 వేలు, వృద్ధాప్య ఫించను కింద రూ. 4 వేలు, రైతు భరోసా, రూ. 500కే గ్యాస్ సిలిండర్ ఇస్తానని నమ్మించారన్నారు.

మోడీ ప్రధాని అయిన తర్వాత ధరలు పిరం

మోడీ ప్రధాని అయిన తర్వాత ధరలు పిరమైనయని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తెలిపారు. గ్యాస్ సిలిండర్‌ను రూ. 400 నుంచి రూ. 1200కు పెంచిన బీజేపీ వారికి ప్రజల్లోకి వెళ్లి ఓటు అడిగే నైతిక హక్కులేదన్నారు. జయచంద్రారెడ్డి చారిటబుల్ చైర్‌పర్సన్ దేవిరెడ్డి కమలా సుధీర్‌రెడ్డి, రాగిడి రజినిరెడ్డి మాట్లాడుతూ.. మహిళలకు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు ఎన్నికల్లో ఓటుతోనే సమాధానం చెప్పాలని సూచించారు. ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి మల్కాజిగిరి పార్లమెంట్ నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు కొప్పుల విఠల్ రెడ్డి, రమావత్ పద్మానాయక్, బీఆర్ఎస్ మహిళా విభాగం నాయకులు పాల్గొన్నారు.

మానసిక ప్రశాంతత అవసరం

మానసిక ప్రశాంతత అవసరమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. దాసర్లపల్లిలో ఆంజనేయ స్వామి ఆలయంలో పూజలు చేసి, పురాతన ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలని కోరారు.

- కందుకూరు

ఇంటింటి ఎన్నికల ప్రచారం

హైదరాబాద్ పార్లమెంట్ మజ్లిస్ అభ్యర్థి అసదుద్దీన్ ఒవైసీకి మద్దతుగా పట్లన్‌లో మలక్‌పేట ఎమ్మెల్యే బలాల ప్రచారం నిర్వహించారు. కిడ్నీ హాస్పిటల్ లైన్, పట్లన్, హరిహర మైసమ్మ ఆలయం, పట్లన్ చౌరస్తా, మున్సిపల్ గ్రౌండ్ ప్రాంతాల్లో పర్యటించారు. కార్యక్రమంలో అక్బర్‌బాగ్ కార్పొరేటర్ మినాజుద్దీన్ పాల్గొన్నారు.

- సైదాబాద్

మహనీయుల ఆశయసాధనకు కృషి

అంబేద్కర్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న పల్లె రవికుమార్, నక్క వెంకటేశ్

సమావేశంలో మాట్లాడుతున్న బడంగ్‌పేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాధిక

ఆర్కేపురం, ఏప్రిల్ 15 : మహనీయుల ఆశయసాధనకు కృషిచేయాలని కల్లుగీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్‌గౌడ్ అన్నారు. సోషలిస్టు విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో మహనీయుల జయంతి ఉత్సవాల సందర్భంగా కొత్తపేటలోని బాబు జగ్జీవన్‌రామ్ భవన్‌లో అన్నదానం చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పల్లె రవికుమార్ హాజరై అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సోషలిస్టు విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నక్క వెంకటేశ్, ప్రధాన కార్యదర్శి శివలింగం, పాల్గొన్నారు.

బడంగ్‌పేట, ఏప్రిల్15 : బడంగ్‌పేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహనీయుల జయంతి ఉత్సవాలను నిర్వహించారు. జ్యోతిరావు పూలే, అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ చిత్ర పటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రాధిక మాట్లాడుతూ.. అట్టడుగు వర్గాలు, స్త్రీల హక్కుల కోసం మహనీయులు చేసిన త్యాగాలు, పోరాటాలు వెలకట్టలేనివన్నారు. స్త్రీలు అభివృద్ధి చెందుతున్నారంటే అందుకు వారే కారణం అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ చందోజీ రావు, డాక్టర్ కరిముల్లా, విద్యార్థులు పాల్గొన్నారు.

సేవచేసేందుకు ముందుకు రావాలని హైకోర్ట్ జడ్జి జస్టిస్ శ్రీసుధ అన్నారు. పంజాగుట్ట పర్యాటక భవన్‌లో విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ సంస్థ ఆధ్వర్యంలో ఉగాది ఉత్సవాలు నిర్వహించారు. ఎల్బీనగర్‌లో అనాథ విద్యార్థి గృహాన్ని ఏర్పాటు చేసి సేవచేస్తున్న రాజేశ్‌కు అవార్డును ముఖ్యఅతిథి జస్టిస్ శ్రీసుధ అందజేశారు. గుమ్మి రాంరెడ్డి, విశ్రాంత ఐఏఎస్ అధికారి లక్ష్మీకాంతం, విశ్వగురు ఫౌండర్ సీఈవో సత్యఓలు రాంబాబు, మదన్ మోహన్ పాల్గొన్నారు.

- ఆర్కేపురం

సరూర్‌నగర్ డివిజన్ వెంకటేశ్వర కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాలనీలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని అసోసియేషన్ ప్రతినిధులు ప్రారంభించారు. మాజీ కౌన్సిలర్ దర్పల్లి అశోక్, వేంకటేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ కోరుపోలు భాస్కర్ రెడ్డి, అసోసియేషన్ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, ప్రధాన కార్యదర్శి ప్రసాద్, కోశాధికారి సాయికిరణ్ పాల్గొన్నారు.

- ఆర్కేపురం

బీజేపీకి తగినబుద్ధి చెప్పాలి

బీజేపీకి తగిన బుద్ధి చెప్పాలని చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి భార్య టీటీడీ బోర్డు మెంబర్ సీత తెలిపారు. సోమవారం బడంగ్‌పేట్ ఇన్‌చార్జి జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, మేయర్ పారిజాత నర్సింహారెడ్డిలతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్పొరేటర్లు, ఎన్ఎస్‌యూఐ నాయకులు పాల్గొన్నారు.

- కందుకూరు / బడంగ్‌పేట

మధుయాష్కిగౌడ్‌కు మాతృవియోగం

హయత్‌నగర్, ఏప్రిల్ 15 : టీపీసీసీ క్యాంపెయిన్ కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కిగౌడ్ మాతృమూర్తి అనసూయ(85) సోమవారం ఉదయం పరమపదించారు. బంజారాహిల్స్, రోడ్డు నం.10లోని మధుయాష్కి గౌడ్ ఇంట్లో ఉదయం 8:30 గంటలకు తల్లికి ఎలాంటి కదలికలు లేకపోవడంతో ఆమెను వెంటనే ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లుగా వైద్యులు నిర్ధారించారు. కొన్ని రోజులుగా ఆమె వృద్ధాప్య సమస్యలు, అస్వస్థతతో బాధపడుతున్నారు. మధ్యాహ్నం వరకు ఆమె పార్థివదేహాన్ని బంజారాహిల్స్, ఇంట్లోనే ఉంచి సాయంత్రానికి హయత్‌నగర్‌లోని సొంత ఇంటికి తీసుకొచ్చారు.

జాతీయ నాయకుడిగా ఎదిగేందుకు తనకు నేర్పిన క్రమశిక్షణ, ఉన్నత చదువులు చదివేందుకు అందించిన ప్రోత్సాహాన్ని మధుయాష్కి గౌడ్ గుర్తుచేసుకుని కంటతడి పెట్టారు. పార్థివదేహాన్ని సాయంత్రం 5 గంటలకు హయత్‌నగర్‌లోని పాతఇంటికి తీసుకొచ్చారు. బంధువులు, గ్రామస్తులతోపాటు ఎల్బీనగర్ నియోజకవర్గం నాయకులు హాజరై నివాళులర్పించారు. సాయంత్రం 7 గంటలకు హయత్‌నగర్ రేడియో స్టేషన్ పక్కనున్న వారి వ్యవసాయ క్షేత్రంలో అంత్యక్రియలు నిర్వహించారు.